క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే అభివృద్ధి

కొనకనమిట్ల: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టు రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ రైతులు సహకరిస్తే ఈ ప్రాంతంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు వలన ఎంతోమందికి ఉపాధి దొరకుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరికె సుఖ్‌దేవ్, ఎంపీడీఓ ఈశ్వరమ్మ, తహసీల్దార్ సురేష్, ఈఓపీఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి బ్రహ్మానాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్ ర్యాలీ



రన్‌ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న సంఘ పెద్దలు

బేస్తవారిపేట: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినం సందర్భంగా రన్ ఫర్ జీసస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. రన్ ఫర్ జీసస్ కో ఆర్డినేటర్ తోటకూరి పీటర్ ఆధ్వర్యంలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పాదర్ మహేష్‌బాబు ర్యాలీని ప్రారంభించారు. బేస్తవారిపేటలోని ది తెలుగు బాప్టిస్ట్ చర్చి వద్ద నుంచి గొట్లమిండ్లలోని క్రైస్తవ ప్రార్థన మందిరం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ గుర్రం జాన్ బీ రంగయ్య, ఫాస్టర్ మహేష్‌బాబు, పీటర్, వేశపోగు బాలు, సామ్యేల్ రామచంద్రా, గొట్టం ప్రభాకర్, చల్లగాలి విక్టర్, షాలెం రాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలను నిర్మూలిద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే కందుల

మార్కాపురం: ఇంట్లో పాడైపోయిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను జాగ్రత్తగా పక్కన వేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కమిషనరు డీవీ నారాయణరావు ప్రజలకు సూచించారు. శనివారం పట్టణంలోని దోర్నాల బస్టాండు వద్ద నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమీషనరు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలైన పనికిరాని కంప్యూటర్ మానిటర్లు, సీపీయూలు, పాత టీవీలు, పనికిరాని ఫ్రిజ్‌లు, వైద్య పరికరాలు, పాడైన ఎల్ఇడి బల్బులు ఇళ్లలో ఉంటే దగ్గరలో ఉన్న సచివాలయానికి సమాచారమిస్తే మున్సిపల్ సిబ్బంది వాటిని తీసుకెళ్లి ధ్వంసం చేస్తారన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



ఎంపీపీ పాఠశాల ఆవరణను పరిశీలిస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి

కొమరోలు: మండలంలోని తాటిరెడ్డిపల్లె గ్రామంలో ఎంపీడీవో మస్తాన్‌వలి శనివారం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరు చేసిన పశువుల తొట్టి నిర్మాణ పనులను పరిశీలించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, హెల్త్ సెంటర్‌ను, ఎంపీపీ పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడి కేంద్రంలో టిహెచ్ఆర్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

మార్కాపురం: పట్టణంలోని మెయిన్ బజార్లో శనివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య ప్రముఖుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ చీదెళ్ల లక్ష్మణరావు మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదానంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రతినిధులు జీవీ సుబ్రహ్మణ్యం, కోటి మోహన్, చినమల కొండ వెంకట సుబ్బారావు, రామకృష్ణ కేశవరావు, రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వానా వానా రాకమ్మా..
కష్టాన్ని కళ్లారా చూడమ్మా !



పొలంలో ఆరబెట్టిన మిర్చి



మేఘావృతమైన ఆకాశం

- ఆకాశంలో పట్టిన మబ్బులతో ఆందోళనలో రైతులు
- మిర్చి కోసం పొలాల్లోనే రైతుల కాపలా

మార్కాపురం: నోటికి అందివచ్చిన కూడును పాడు చేవద్దని వరుణ దేవుడిని వేడుకుంటున్నారు రైతన్నలు. గత వారం రోజుల నుంచి పశ్చిమ ప్రకాశంలో ఉదయం పూట మండే ఎండ.. సాయంత్రం పూట ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోంది. దీనితో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరిదశ మిర్చి కోసిన రైతులు పంటను ఇళ్లకు తెచ్చుకోకుండా పొలాల్లోనే గ్రేడింగ్ చేసుకుంటున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది గత వారం రోజుల నుంచి అకాల వర్షాలు కురుస్తున్నాయి. మిర్చి తడిసిపోవడంతో నాణ్యత తగ్గి రంగుమారి, ధర తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే క్వింటా మిర్చి ధర రూ.7500 ధరకు దిగజారి పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో మిర్చి తడిస్తే ఇంకా ధర తగ్గి నష్టాలు వస్తాయన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. గత వారం నుంచి పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, యరగొండ పాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో సాయంత్రం పూట వర్షం పడుతోంది. మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, కంభం, గిద్దలూరు, రాచర్ల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు తదితర మండలాల్లో వర్షంపడుతోంది. దీనితో పొలాల్లో ఉన్న మిర్చి తడిసిపోతోంది.

మిర్చి సాగు ఇలా..

మండలం	సాగు ఎకరాల్లో
మార్కాపురం	2657.52
దోర్నాల	5817.10
పెద్దారవీడు	4543.83
యర్రగొండపాలెం	10409.49
త్రిపురాంతకం	5767.35
గిద్దలూరు	893.33
పుల్లలచెరువు	8098.75

పట్టాలతో మిర్చికి రక్షణ..

మిగిలిన మండలాల్లో తక్కువ విస్తీర్ణంలో మిర్చి సాగైంది. ఎకరాకు సుమారు రూ.1.25 లక్షల నుంచి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి రూపంలో మిర్చిపై రైతులు ఖర్చుచేశారు. అకాల వర్షాలు మిర్చి రైతులను దెబ్బ తీశాయి. దీనితోపాటు తెగుళ్లు కూడా దిగుబడులపై ప్రభావం చూపాయి. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకూ దిగుబడి రావచ్చని అంచనా వేసుకుంటే 10 నుంచి 11 క్వింటాళ్ల వరకూ మాత్రమే వచ్చాయి. చివరి కోతలోనైనా డబ్బులు వస్తాయని భావిస్తే అకాల వర్షాలు దెబ్బ తీస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఉద్యాన శాఖాధికారులు పట్టాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

మబ్బు పట్టిందంటే భయంగా ఉంటోంది..



గత వారం రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలతో ఆందోళనగా ఉంది. కోసిన మిర్చిని ఇంట్లో ఉంచుకోలేక, గ్రేడింగ్ చేస్తూ పొలాల్లోనే ఉంచాం. గత వారం కురిసిన వర్షానికి మిర్చి కొద్దిగా తడిసింది. దీనితో వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తారు. ఈ ఏడాది మిర్చి సాగు నష్టాలను మిగిల్చింది.

– ఆవులయ్య మిర్చి రైతు

గ్రామాల శుభ్రతతో ఆరోగ్యం



కొమరోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది



బేస్తవారిపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరం కలసిమెలసి స్వచ్ఛతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు అన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. తడి, పొడి చెత్తలను వేరువేరుగా వేయాలని కోరారు. ఈ సందర్భంగా పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జితేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ టీ నాయక్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో అటవీశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అల్లినగరం బీట్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది కొమరోలులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి వ్యర్థ పదార్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైక్లింగ్ చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద సృష్టించడం ద్వారా సర్క్యులర్ ఎకానమీ సాధ్యమవుతుందన్నారు.



గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

హాస్పిటళ్లలో అగ్ని ప్రమాదాలపై జాగ్రత్త అవసరం



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ

మార్కాపురం: హాస్పిటల్స్‌లో అగ్ని ప్రమాదాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని మార్కాపురం ఫైర్ ఆఫీసర్ ఆర్ రామకృష్ణ అన్నారు. అగ్నిమాపక అవగాహన వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ప్రజా వైద్యశాలల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై ఆయన తన సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. అనుకోకుండా ఏదైనా అగ్ని ప్రమాదాలు జరిగితే హాస్పిటల్‌లో ఉన్న వృద్ధులను, పిల్లలను, రోగులను, సురక్షితంగా ఎలా తీసుకునిరావాలో డెమో ద్వారా వివరిస్తూ కాపాడే పద్ధతులను హాస్పిటల్ సిబ్బందికి మాక్ డ్రిల్ ద్వారా తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పగడాల లక్ష్మిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి హరిబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కేఎస్ పల్లె గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అగ్నిప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిమాపకశాఖ వారి అనుమతుల మేరకు అపార్ట్‌మెంట్లు, స్కూల్స్, రెస్టారెంట్స్, సినిమా థియేటర్స్, వైద్యశాల భవంతిలు నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది బీమానాయక్, డి.పీరావలి, రియాజ్, లక్ష్మీనాయక్, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

వృథాగా సాగర్ నీరు



వృథాగా పోతున్న సాగర్‌నీరు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు మెయిన్‌బజారులో ఉన్న సాగర్‌పైపులైన్ పగిలిపోయి శనివారం రాత్రి సాగర్‌నీరు వృథాగా వీధుల్లో పారింది. వేసవికాలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో సాగర్ పైపులైను పగిలి నీరు వృథా కావడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేయాలని కోరారు.

టాలెంట్ టెస్ట్‌తో సామర్థ్యాల పెంపు



విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

కంభం: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో క్లస్టర్ స్థాయిలో అన్ని పాఠశాలల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు బీ మాల్యాద్రి, టీ శ్రీనివాసులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సమగ్ర విద్యా సామర్థ్యాలను అంచనా వేసేందుకు, వ్యక్తిగత ప్రతిభను గుర్తించేందుకు క్విజ్, తరగతి వారీగా టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామని చెప్పారు. జంగంగుంట్ల క్లస్టర్ పరిధిలో 13 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ గని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందన అలంకారంలో చెన్నకేశవుడు



అలంకారంలో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం చెన్నకేశవస్వామి అర్చకులు చందన అలంకారంలో స్వామివారిని అలంకరించారు. ప్రత్యేక అలంకారంలో స్వామివారిని విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి అలంకారం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఏడాదికొకసారి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు చందన అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. శనివారం స్వామివారు గరుడవాహనంపై అర్ధరాత్రి దాటిన తరువాత దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా గత కొన్ని శతాబ్దాలుగా జరుగుతున్న సాంప్రదాయం ప్రకారం గరుడోత్సవం సందర్భంగా ఆలయంలో బ్రాహ్మణ సమారాధన నిర్వహించారు.

ఎవరో వస్తారని.. గుంత పూడుస్తారని..

- రహదారిపై ఉన్న గుంతను పూడ్చిన యువత



గుంతను పూడుస్తున్న యువకులు

కొమరోలు: కూటమి ప్రభుత్వ నాయకులకు, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో యువకులే నడుం బిగించారు. మండలంలోని కడప-అమరావతి రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన గుంతను పామూరుపల్లె గ్రామస్తులు పూడ్చివేశారు. పామూరుపల్లె గ్రామ సమీపంలోని త్రిపురాంతకేశ్వరస్వామి దేవాలయం వద్ద పెద్దగా ఏర్పడిన గుంత వలన తరచుగా రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈరహదారి ప్రమాదాలలో ద్విచక్ర వాహనదారులు గాయపడుతుండడంతో విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో పామూరుపల్లె ఎస్సీ పాలేనికి చెందిన యువత కంకర, సిమెంటు, ఇసుకతో పెద్దగా ఏర్పడిన గుంతను పూడ్చివేశారు. దీనితో రహదారి ప్రమాదాలు సంభవించవని వారు తెలిపారు. ఈసందర్భంగా పలువురు పామూరుపల్లె ఎస్సీ పాలెం యువకులను అభినందించారు.

సీతారాములకు పట్టాభిషేకం



రేగడపల్లిలో అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని గరిమినపెంటగ్రామంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాములస్వామికి భక్తుల కోలాహలం నడుమ ఆనందోత్సాహాలతో, వేదపండితుల మంత్రోచ్ఛరణలతో సీతారాములకు పట్టాభిషేకం క్యాక్రమం నిర్వహించారు. సీతారామ, లక్ష్మణ స్వామి ఉత్సవ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. పట్టాభిషేకం ఉత్సవంలో భక్తులు వారు పోసి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు నారాయణశర్మ పలువురు దంపతులచే అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజీమార్గంతో కేసుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: రాజీమార్గం ద్వారా కేసులను సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నించాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బ్యాంకర్లు, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో శనివారం మే 10వ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసులల్లో ఇరుక్కున వారికి రాజీమార్గం వైపుగా వెళ్లేందుకు ప్రయత్నించాలన్నారు. కేసులు పరిష్కరించుకోవడం వల్ల వారి కుటుంబాల్లో శాంతి నెలకొంటుందన్నారు. సమాజంలో కూడా మార్పు వస్తుందన్నారు. కోర్టుల్లో కేసులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉంటున్నాయన్నారు. కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. లోక్ అదాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం, అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ నాయబ్ రసూల్, నగర పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ టపావలి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నల్లబండ బజారులో స్థానిక అర్బన్ సీఐ కె.సురేష్, గిద్దలూరు రూరల్ సీఐ రామకోటయ్యల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం వేకువజామున నుంచే కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ కార్డన్ సర్చ్ ద్వారా నేరాలను అదుపుచేసేందుకు అవకాశాలున్నాయన్నారు. చట్ట వ్యతిరేక శక్తులను గుర్తించేందుకు కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 11 ద్విచక్రవాహనాలను గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఇమ్మానియేల్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు మార్కాపురంలో ట్రాఫిక్ ఆంక్షలు



సీఐ సుబ్బారావు

మార్కాపురం: శ్రీవారి బ్రహోత్సవాలసందర్భముగా మార్కాపురం పట్టణంలో ఆది, సోమవారాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలుచేస్తున్నామని ప్రజలు, వాహనదారులు, భక్తులు, పోలీసులకు సహకరించాలని సీఐ సుబ్బారావు తెలిపారు. ఆదివారం ఉదయం, సాయంత్రం, సోమవారం ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారి ఉత్సవాలు జరిగే సమయంలో 4 మాఢవీధుల్లో ఎటువంటి వాహనాన్ని కూడా అనుమతించమని, అందరూ నడిచే వెళ్లాలని తెలిపారు. స్వామివారి నగరోత్సవానికి విశేషసంఖ్యలో భక్తులు హాజరవుతారని, ఉత్సవానికి ముందు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, దీనితో మెయిన్ బజారు, పాత బస్టాండు, దోర్నాల సెంటరు నాయుడు వీధి, రథం బజార్లలో వాహనాల రాకపోకలను నిలిపివేస్తామని చెప్పారు. ఆర్టీసీ బస్సులను కూడా మార్కెట్‌యార్డు వద్దగల వై జంక్షన్ నుంచి డ్రైవర్స్ కాలనీ, చెరువుకట్ట మీదుగా రాకపోకలు సాగించాలని అన్నారు. దోర్నాల, శ్రీశైలం, వినుకొండ, విజయవాడ,మాచర్ల, యర్రగొండపాలెం వైపునుంచి వచ్చే బస్సులన్నీ వై జంక్షన్, ఎస్టేట్, చెరువుకట్ట మీదుగా బస్టాండుకు చేరుకోవాలని అన్నారు.